క్లుప్తంగా

22న చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలు ఉంటాయని భక్తులు పాల్గొనాలని కోరారు.

ఖాజీపేట సీఐగా రమణారెడ్డి

ఖాజీపేట : ఖాజీపేట సీఐగా ఉన్న రామాంజులును కర్నూలు జిల్లాకు వీర్‌కు తీసుకున్నారు. ఆయన స్థానంలో ప్రొద్దుటూరు తాలుకాలో పనిచేస్తున్న సీఐ రమణారెడ్డి ఖాజీపేటకు బదిలీ అయ్యారు.

ఆర్థిక సహాయం

ప్రొద్దుటూరు కల్చరల్ : నిరుపేద వధువుకు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నాడు అయూబ్‌ఖాన్. స్థానిక గోకుల్ నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ మహమ్మద్ హుసేన్ కరోనాతో మూడు ఏళ్ల క్రిందట మృతిచెందాడు. ఆయన భార్య షరీఫున్ కుమార్తె వివాహానికి ఇబ్బందులు పడుతుండటంతో విషయం తెలుసుకున్న మనప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అయూబ్‌ఖాన్ తనవంతు ఆర్థిక సహాయం అందించారు. బుధవారం ఇస్లాంపురం వీధిలోని టీడీపీ నాయకుడు ముక్తియార్ ఇంటిలో ఆయన చేతుల మీదుగా పెళ్లికి గాను రూ.20వేలు నగదు, పట్టు వస్త్రాలను వధువు తల్లికి అందజేశారు. కార్యక్రమంలో మనప్రజా సేవా సమితి ఉపాధ్యక్షుడు బీటెక్ బాష, గౌరవాధ్యక్షుడు అరబ్ పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

బద్వేలు అర్బన్ : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక షాలోమ్ అనాథ శరణాలయంలో కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు షేక్‌మహబూబ్ బాషా మాట్లాడుతూ బీజేపీ అరాచక పాలనను ఎండగడుతూ అనునిత్యం ప్రజల కోసం పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీ నేటి యువతకు ఆదర్శమని అన్నారు. అలాగే దేశంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగి భారత్‌ను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భారత్ జోడో యాత్ర చేపట్టి ప్రజల మనుస్సులను గెలుచుకున్న ఘనత రాహుల్‌గాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్‌ఇమాంబాష, షేక్‌హుస్సేన్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

బద్వేలు అర్బన్ : ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీసులు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీనియర్ సివిల్ కోర్టు హాలులో కోర్టు పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కక్షిదారుల్లో అవగాహన పెంపొందించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీపడటానికి అవకాశమున్న కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక అనే విషయాన్ని కక్షిదారుల్లోకి తీసుకుపోవాలన్నారు. సమావేశంలో ఏపీపీ ఉమాదేవి, మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు, సీఐలు విక్రమసింహ, యుగంధర్, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మంజుల, ఆయా స్టేషన్ల ఎస్‌ఐలు, కోర్టు కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

నిలకడగా కుందూనది ప్రవాహం



చాపాడు మండలంలో ప్రవహిస్తున్న కుందూనది

చాపాడు : వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా కుందూనది నిలకడగా ప్రవహిస్తోంది. పైతట్టు ప్రాంతాలలో సైతం వర్షాలు పడుతుండటంతో కుందూనదిలో బుధవారం 1256 క్యూసెక్కులతో వర్షపు నీరు ప్రవహిస్తోన్నట్లు రాజోలి ఆనకట్ట ఏఈ జమాల్‌రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా పసుపు పంట సాగు చేసేందుకు రైతులు సమాయాత్తమవుతున్నారు.

చాపాడులో కూలిన చెట్టు..

ఇటీవల తరచుగా కురుస్తున్న వర్షాల కారణంగా చాపాడులో 50 ఏళ్ల పైబడి వయస్సు కలిగిన చెట్టు నెలకొరిగింది. నాలుగు రోడ్ల కూడలిలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఎదురుగా పంట పొలం వద్ద ఉన్న చెట్టు మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వీచిన ఈదురు గాలులకు పడిపోయింది.

అనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన



సికిల్ సెల్, అనీమియా వ్యాధి వ్యాప్తి, నివారణ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ఉదయ్‌కిరణ్

చాపాడు : మండలంలోని చిన్నగురువళూరు గ్రామంలోని హెల్త్ అండ్ వెలనెస్ క్లీనిక్‌లో బుధవారం సికిల్ సెల్ అనిమియా వ్యాధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కలిగేలా వైద్యాధికారులు రాజేష్‌కుమార్, కావ్య మాధురి గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సికిల్ సెల్ అనిమియా వ్యాధి వంశ పార్యపరంగా వస్తుందన్నారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంతో ఇబ్బందిగా ఉండటం, అలసట, గర్భదారణ సమయంలో సమస్యలు రావటం, శరీర అవయవాలైన కిడ్నీలు, మెదడు, ఎముకలు, కండరాలపైన ప్రభావం చూపుతుందన్నారు. గర్భిణీ మహిళల్లో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. అర చేతులు, కాళ్ల వాపులు, ఎముకలపై దురద వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యాధికారి కావ్య మాధురి మాట్లాడుతూ ఈ వ్యాధి వలన నష్టము కలగడం, ఈ వ్యాధి నివారణకు సరైన కాలంలో గుర్తించడం వలన నయం చేయవచ్చన్నారు. సమతుల పౌష్టికాహారం, ప్రత్యేక టీకాలు వేయించుకోవాలన్నారు. చికిత్స రోగ నిర్ధారణ అయిన వారికి హైడ్రోక్సీ యూరియా మాత్రలతో పాటు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వటం జరుగుతుందన్నారు. అత్యవసరమైతే రక్తం ఎక్కించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, ఆశ నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్లు సరస్వతీ, బాబురెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు : మండల కేంద్రమైన బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సికెల్ సెల్ వ్యాధిపై వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ వ్యాధి ఆటోసోమల్ రెసెసివ్ రీతిలో వంశపార్యపరంగా సంభవిస్తుందన్నారు. ఇది ఎర్ర రక్తకణాలలో హిమోగ్లోబిన్‌గా పిలువబడే అసాధారణ హిమోగ్లోబిన్ ఉనికి వలన కలిగే రక్త ప్రధాన వ్యాధి అని అన్నారు. గర్భిణీగా ఉన్నప్పుడు దీర్ఘకాలిక రక్తహీనత, ఇన్‌ఫెక్షన్ల ముప్పు, కాలేయం, మూత్రపిండాలు, మెదడు వంటి అవయవాల్లో గణనీయమైన సమస్యలు ఈ వ్యాధి లక్షణాలు అని మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ సీతారామిరెడ్డి, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, ఆప్తాలమిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైద్యాధికారి మునీబ్

ఖాజీపేట : సివిల్ సెల్ అనిమియా వ్యాధి పట్ల పూర్తి అవగాహనతో అందరూ ఉండాలని ఖాజీపేట వైద్యధికారి మునీబ్ సూచించారు. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ సెల్ అనిమియా వ్యాధిపై స్థానిక ప్రజలకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2024 నాటికి సివిల్ సెల్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దీనివల్ల ఎర్ర రక్తకణాలు కొడవలి ఆకారంలో మారడం ను సివిల్ సెల్ అంటారన్నారు. కళ్ళు పసుపు రంగులోకి మారడం, ఒళ్ళు నొప్పులు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవడం కష్టతరం కావడం, శరీర అవయవాలకు నష్టం కలగడం లక్షణాలుగా బావించాలన్నారు. నివారణకు సమతుల అహారం, టీకాలు వేయించుకోవడం వల్ల నివారణ చేయవచ్చునన్నారు. అత్యవసరం అయితే రక్తం ఎక్కుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, ఆశ నోడల్ అధికారి అరుణకుమారి పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఉన్న సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ పేర్కొన్నారు. బుధవారం ఏడీఏ కార్యాలయంలో ఏఓ రామకృష్ణతో కలిసి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల సీజన్ ప్రారంభం అవుతున్నందున భూసారవంతం కోసం ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే పచ్చరొట్ట విత్తనాలను రైతులకు సకాలంలో అందజేయాలన్నారు. అలాగే అవసరమైన ఎరువులను ఆర్బీకేలలో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వివిధ పంటలు సాగు చేసే రైతులు విత్తనాలు మొలకశాతం నిర్ధారణ పరీక్షలు పూర్తయిన తర్వాతనే సాగు చేయాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు సమయంలో రైతులు బిల్లులు తీసుకుని పంటకోత పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ నిధులు అర్హత ఉన్న రైతుల అకౌంట్లకు జమ అయ్యేలా సిబ్బంది చూడాలన్నారు. బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని పంట రుణాల మంజూరుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు విజయకుమార్, ఓబయ్య, సతీష్, బాదుల్లా, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరయ్య స్వామి తిరునాల



కోలాటం చేస్తున్న మహిళలు

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామంలో బుధవారం శ్రీ అవధూత దిగంబర వీరయ్యస్వామి వారి ఆరాధన మహోత్సవ వేడుకల తిరునాల ఘనంగా నిర్వహించారు. వీరయ్యస్వామి ఆరాధన మందిరంలో ఉదయం 6.30 గంటల నుంచి గురుపూజ, పుష్పాలకరణాది అర్చనలు చేశారు. 7.30 గంటలకు భగవన్నామ సంకీర్తనలు బద్రిపల్లె భజన సంఘంచే ప్రారంభించి లక్ష్మీపేట, కేతవరం, నీలాపురం, సంగటి తిమ్మాయపల్లె, గుడిపాడు, పాటిమీదిపల్లె, గుంతచీపాడు, ఓబుళరెడ్డిపేట, ఖాన్‌ఖాన్‌పల్లెతో పాటు 23 గ్రామాలకు చెందిన భజన బృందాలచే సంకీర్తనలు జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. మహిళలు నిర్వహించిన కోలాటం, చెక్క భజనలు ఆకట్టుకున్నాయి. రాత్రి 9 గంటలకు భక్త చింతామణి పూర్తి నాటకం వేశారు.

పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలను నివారించాలి

మైదుకూరు : పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా సంబంధిత యజమానులు చర్యలు తీసుకోవాలని మైదుకూరు అగ్నిమాపక కేంద్రం అధికారి వెంకటరమణ తెలిపారు. బుధవారం రాత్రి మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని పారిశ్రామిక వేత్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అగ్నిమాపక పరికరాలను పరిశ్రమలో తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అన్ని లైసెన్స్‌లతోపాటు ఫైర్ సేఫ్టీ లైసెన్స్ కూడా తీసుకోవాలని సూచించారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం

ప్రొద్దుటూరు క్రైం : మత్తు పదార్థాలు వినియోగిస్తే భవిష్యత్ అంధకారం అవుతుందని సెబ్ సీఐ మహేష్‌కుమార్ అన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో నారాయణ జూనియర్ కాలేజీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులు, అధ్యాపకులకు మంచిపేరు తీసుకు రావాలన్నారు. మత్తు పదార్థాల జోలికి ఎవ్వరూ వెళ్లరాదని చెప్పారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ కిశోర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గో సంరక్షణా సమితి, శివశక్తి, బీజేపీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతూ బుధవారం గో సంరక్షణ సమితి, శివశక్తి, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో యధేచ్చగా గోవధ జరుగుతోందని, దానిని ఆపాలన్నారు. బొల్లవరం, పెద్దగుంత, ఎల్ఐసీ ఆఫీసువద్ద, మదర్‌థెరిసా ఆశ్రమం సమీపంలో బహిరంగంగానే గోవధ జరుగుతోందన్నారు. పలు సార్లు గో సంరక్షణా సమితి వారు దానిని అరికట్టేందుకు ప్రయత్నించినా గోవధ ఆగడం లేదన్నారు. గోవధ నిషేధాన్ని కఠినంగా అమలు చేసి గోవులను కాపాడాలని కోరారు. అలాగే మాంసం దుకాణాలు ఇష్టానుసారంగా శుభ్రతను పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ మేకలు, పొట్టేళ్లను కోసి విక్రయిస్తున్నారని దీనివల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గో సంరక్షణా సమితి అధ్యక్షుడు శివనాగిరెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు నారేంద్రరావు, శివశక్తి రాయలసీమ కన్వీనర్ పుల్లారెడ్డి, రాఘవేంద్రారెడ్డి, దశమందం బాబు, శేషన్న, అనిల్‌కుమార్, రవితేజ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయం



విద్యా సామగ్రిని అందజేస్తున్న ఎంవీఐ, ఎంఈఓ

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు తిరుమల ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు, ఎంఈఓ చెన్నయ్య పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 100 మంది విద్యార్థులకు తిరుమల ట్రస్టు ఆధ్వర్యంలో సమకూర్చిన విద్యా సామగ్రిని బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందించిన సహకారాన్ని అందిపుచ్చుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అలాగే చదువుతో పాటు సేవాగుణం, ఆధ్యాత్మిక భావాలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ పబ్బతిచంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి, ట్రస్టు బృందం సుధాకర్, పబ్బతిసత్యనారాయణ, దాదాపీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందుల పంపిణీ, వైద్యసేవలపై ఆరా



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జాతీయ క్వాలిటీ అసెస్‌మెంట్ టీం సభ్యులు

చాపాడు : మండలంలోని చిన్నగురువళూరు గ్రామంలో ఉన్న విలేజ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ క్లీనిక్‌ను బుధవారం జాతీయ క్వాలిటీ అస్సెస్మెంట్ టీం సభ్యులు డాక్టర్ ప్రేమాన్స్ పాండ్య, డాక్టర్ సిద్ధార్థ శుక్లలు సందర్శించారు. మండలంలోని చాపాడు, నక్కలదిన్నెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు రాజేష్‌కుమార్, కావ్యమాధురిల ఆధ్వర్యంలో మాత శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలపై ఆరాదీశారు. వైద్య సేవలు, మందుల పంపిణీ ఇంకా పలు రకాలైన సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాన్సలీడెంట్ సరళాదేవి, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్లు సరస్వతీ, బాబురెడ్డి, సీహెచ్ఓ శివమ్మ, ఏఎన్ఎం రమీజా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ వరప్రసాదరావు

పోరుమామిళ్ల : పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అప్రమత్తంగా ఉండాలని, వానాకాలంలో గ్రామాల్లో అంటురోగాలు ప్రబలే అవకాశమున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాదరావు, తహసీల్దారు విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సభాభవనంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మురుగుకాలువలు శుభ్రం చేయడం, గుంతల్లో నీరు నిలువ లేకుండా చూడటం, తాగునీరు పైప్‌లైన్లు లీకేజీలు లేకుండా పరిశీలించడంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పైప్‌లైన్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. అశ్రద్ధ కారణంగా రోగాలు ప్రబలితే కఠినచర్యలు ఉంటాయన్నారు. ప్రతి పంచాయతీని ఉన్నతాధికారులు, మండల అధికారులు పర్యవేక్షణ చేస్తారన్నారు. ప్రజా సమస్యలపై పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ రాజీవ్‌రెడ్డి, ఈఓ వెంకటసుబ్బయ్య, కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, ఖాశింపీరా, నారాణబాబు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని సన్మానిస్తున్న ఎన్జీఓ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఏపీ ఎన్జీఓ సంఘం నాయకులు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కోరారు. బుధవారం వారు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, కార్యదర్శి జే రామసుబ్బయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ సదాశివయ్య, వైస్ ప్రెసిడెంట్ శివరామానుజ, మధుసూదన్‌రావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని శానిటేషన్ సిబ్బంది వినతి

తమకు ఐదు నెలలుగా వేతనాలు రాలేదని జిల్లా ఆస్పత్రిలోని శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి విన్నవించారు. సంబంధిత కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సంబంధిత కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డితో మాట్లాడిన ఎమ్మెల్యే సాధ్యమైనంత త్వరగా వేతనాలు ఇవ్వాలని చెప్పారు. భవన నిర్మాణ కార్మికులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రొద్దుటూరు ప్రధాన కార్యదర్శి పూసల చిన్న ఓబన్న, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేయాలని వినతి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో మెడికల్ కాలేజి మంజూరు చేయించాలని, కుందూ–పెన్నా అనుసంధాన కాలువ పూర్తి చేయాలని తెలిపారు. పాలకేంద్రాన్ని తెరిపించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీని నగర కార్పొరేషన్‌గా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు కౌశిక్, ఆదినారాయణ, మహబూబ్ బాషా, రసూల్ తదితరులు పాల్గొన్నారు.